కథ

ఆ క్షణంలో-

అందరి అభినందనలు నన్ను ఉక్కిరి బిక్కిరి చేశాయి.

సంతోషంతో నోటిమాట రాలేదు.

వాళ్ల పొగడ్తల మాట ఎలాఉన్నా-

ఈ ఐదారు నెలల్లో నేను సాధించిన విజయాలుచాలానే ఉన్నాయి.

"మీరే సెక్రటరీగా ఉండాలి తప్పదు మాస్టారూ"-

బలవంతంగా ఒప్పించి నన్ను రంగంలోకి దింపారు.

ఇంతకు ముందెప్పుడూ ఇటువంటి బాధ్యతలు తలకెత్తుకుని ఎరగను. చిన్నప్పట్నుంచి నా స్వభావమేఅంత...నావనేదో నేను చేనుకుపోవడం...

కాలేజీలో ఎన్నికలు వంటివి వస్తే, జ్వరమనో, తలనొప్పనో-ఏదో సాకుచెప్పి తప్పించుకునేవాడిని.మరీ అవసరమయితే తప్ప ఇంట్లో వాళ్లని కూడా పలకరించేవాడిని కాదు. చదువుల పర్వం ముగిశాక...బ్యాంకు ఉద్యోగంలో ప్రవేశించాను.

ఇప్పటికీ నా స్వ భావంలో మార్పు రాలేదుఆఫీసు నుంచి రావటం.. ఏ పుస్తకంలోనో తలదూర్చటం... లేదంటే టీవీ ముందు కూలబడటం-పిల్లల చదువు సంధ్యలూ నేను పట్టించేకోను.అలాంటిది,నన్ను కాలనీ సెక్రటరీగా ఎంపిక చేసి బలవంతంగా బాధ్యతలు అంటగట్టారు

'కిషోర్‌గారూ! అవతల కాలనీ మీటింగుకు టైమవుతోంది. బయలు దేరండి'- పక్కింటాయన ఒత్తిడిచేస్తే బలవంతంగా బయలు దేరాను. అప్పటికే సమావేశం ప్రారంభ మైంది. కాలనీ ప్రెసిడెంటు మాట్లాడు తున్నాడు.అంతా ఊకదంపుడే.

తమ హయాంలో కాలనీలో ఏమేం చేశామో- పాఠం అప్పచెప్పినట్లు గబగబా చెప్పేసి,

శ్రోతల విసుగును గమనించాడేమో- మైక్ పక్కనున్నాయన చేతిలో పెట్టాడు.ఆయన కాలనీ సెక్రటరీ.ప్రెసిడెంటుకి ఏమాత్రం తీసిపోనని నిరూపించుకున్నాడు. 'నేను ఈ పదవి చేపట్టేనాటికి కాలనీలో రోడ్లులేవు. కుళాయి కనెక్షన్లు రాలేదు. మున్సిపాలిటీతో పోరాడాను. ఇక్కడ పని కాకపోతే, రాజధానికి వెళ్లి దగ్గరుండి చేయించుకు వచ్చాను. ఎమ్మెల్యేకి నేను ఎంతచెబితే అంత..."

.... ఈ దఫామరోమారు అవకాశం ఇస్తే''ముక్తాయింపుగా రెండోసారి తననే ఎంచుకోమని పట్టుపట్టాడు.

అదిగో అప్పుడు మొదలయ్యాయి వాదనలు.'ఫలానా వర్గం వాళ్లయితే బావుంటుందని ఒకరు...

ఎప్పుడూ ఒకరికేనా అవకాశం కొత్తవాళ్లకి ఇచ్చిచూద్దామని మరొకరు...

# స్వభావం

క్రితంసారి వ్యాపార వర్గాలకు పదవి దక్కింది కనుక ఈ దఫా ఉద్యోగస్తులను పరిగణనలోకి తీసుకోవాలని మరొకరు.... ఎవరికి వారు పట్టుదలలకు పోయారు.చివరికి అందరూ కలసి. ఉద్యోగస్తులనుంచి ప్రతినిధిని ఎంపిక చేసుకోవాలన్న నిర్ణయానికొచ్చారు.

అనూహ్యంగా... ఏ వర్గానికి చెందని తటస్థ వ్యక్తిగా నాపేరు ముందుకొచ్చింది.

## శ్రీ సాయి పల్లవి

ఇలాంటివి నాకిష్టం ఉండదు.దయచేసి నన్ను ఇబ్బంది పెట్టకండి. బతిమాలినా ఎవరూ వినిపించుకోలేదు."చివరికి నేను ఆమోదించక తప్పలేదు.'నాకు ఇంత మంచి అవకాశం ఇచ్చినమీ అందరికి కృతజ్ఞతలు. మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను" ముక్త సరిగా సంభాషణ ముగించాను.'ఈ బాధ్యత తలకెత్తుకున్నందుకు సాధించి చూపాలి. కాలనీలో ఏదో ఒక గుర్తుండి పోయే పని చేయాలి" అనుకున్నాను ఆ క్షణంలోనే. అప్పుడే ఓ మంచి పనికి బీజం పడింది నా మనసులో

× × ×

ఇంతకు ముందు వాళ్లనిచాలా సార్లు చూశాను అదే స్థలంలో.

వచ్చేపోయే ఆడవాళ్ళని వెకిలిగా కామెంట్ చేయటం గమనించాను.

ఆ నలుగురికీ ద్విచక్ర వాహనాలున్నాయి.

వస్త్ర ధారణలో ఆధునికత తొంగి చూస్తుంటుంది.

అందమైన కళలు కంటూ- వృధా కబుర్లతో సమయాన్ని నిరర్థకంగా గడిపే వాళ్లంటే- నాకు ఏమాత్రం సదభిప్రాయంలేదు.

ఒక్కో సినిమా ఎన్ని రోజులు ఆడింది... హీరో హీరోయిన్ల పారితోషికాలు ఏ మేరకు హెచ్చుతున్నయి? విదేశాల్లో షూటింగుల్లో ఉన్న వాళ్ళెవరు వంటి విషయాలు వాళ్ళ నాలికమీద ఉంటాయి. వచ్చే ఏడాది ఎవరు నెంబర్ ఒన్ అవుతారో ఇట్టే చెప్పేయగలరు. ఇవేమీ ఇతరులకు ఇబ్బంది కలిగించే అంశాలు కాదుగానీ... సాయంత్ర

మయిందంటే చాలు....

రక్కున ఆ నలుగురు అక్కడ చేరటం... పొగ ఊదుతూ...స్కూలుకెళ్లే విద్యార్థినులనుంచి... నడివయసు స్త్రీల వరకూ... వయో భేదం చూడకుండా.... కనిపించిన వాళ్లనందరినీ...

"ఆంటీ విరగదీస్తోందిరా...ఇప్పుడే ఇలా ఉందంటే చదువు కునేరోజుల్లో కుర్రాళ్లకి చెమటలు పట్టించేసుంటుంది."ఆc!! ఇప్పుడు మాత్రం ఏం తక్కువని...?ఈ విడకు పదిహేనేళ్ల కూతురుందంటే నమ్మ బుద్దెయ్యదు...

కాకి ముక్కుకి దొండపండు అన్న సామెత వీళ్ల'ఆయనని చూడగానే గుర్తుకొస్తుంది..."

ఆంటీ ఇంత గ్లామర్ ఎలా మెయింటెయిన్ చేస్తోం దో?... ఒరే బ్లాక్ అండ్ వైట్ టీవీరా"- అంటే,..."

భర్త బ్లాక్ ..భార్య వైట్" మొగుడు ముద్దెట్టు కుంటే ఆ అమ్మాయికి వాంతి అయితీరుతుంది.'తన నలుపు ఆమెకి అంటుకుంటుందేమోననిమనవాడు అంటీ ముట్టకుండా..." మరి అసలు విషయం...

అమాట ఎత్తగానే మిగిలిన వాళ్లంతా ఒకటేనవ్వు...

"నిన్నమొన్నటి వరకూ ఫ్రాక్ వేసుకుని స్కూలుకెళ్లేది. మన కళ్లముందే ఎంత ఎదిగింది? పిటపిటలాడిపోతోంది...' ఇలా ఏదో ఒక రకంగా స్త్రీల అందాలను ఏ శృంగార రచయితకీ తీసిపోని విధంగా వర్ణించేవాళ్లు. ఆమాటలు సున్నితంగా ఉండేవి కావు. వాళ్ల ప్రవర్తనా సరదాగాఉండేదికాదు.

అంతా మొరటుదనం..... అంతకు మించి వెకిలితనం... వాళ్లని భరించటం నిజంగా కష్టం....

ఆరోజు కావాలని వాళ్లని నా ఇంటికి ఆహ్వానించాను. అటువంటి బేవార్సు గాళ్లని ఇంటికి పిలిచినందుకు నా శ్రీమతి 'గయ్' మంది బలవంతంగా ఆమెను ఒప్పించాను.ముందుగా సినిమా లతో సంభాషణ ప్రారంభిం చాను. కాలనీ అంతా వాళ్లని అంటరాని వాళ్ళుగా, అసహ్యంగా చూస్తుంది. నేను ఇంటికి పిలిచే సరికి మొదట భయపడ్డారు.సరదాగా మాట్లా డటంతో కుదురుకున్నారు. నేను మాట్లాడటం మొదలు పెట్టాను. 'ఫ్రెండ్స్ - ఈ మధ్య మన కాలనీలో ఈవ్ టీజింగ్ ఎక్కువయింది.ఆడవాళ్లు బయటకు రావాలంటే హడలిపోతున్నారు.పెళ్లయిన వాళ్లు,కాని వాళ్లని తేడాఏ మాత్రం చూపకుండా పోకిరిలు విజృంభిస్తున్నారు. సభ్యత పరిధిదాటుతున్న ఈ వికృతచేష్టలుభరించరానివిగా మారుతు న్నాయి.దీనిపైనఆయన ప్రెసిడెంటు గారికిచాలాపిర్యాదులొచ్చాయి. ఆయన పోలీసు కంప్లెయింటు ఇవ్వాలను కుంటున్నారు"...

వాళ్ల మొహంలో రంగులు మారటం గమనించాను .శ్రీమతి తెచ్చిన టీ వాళ్ల కందించి మళ్ళీ కొనసాగించాను.

"....పోలీసులు ఈ కాలనీలో అడుగు పెట్టటం నాకిష్టంలేదు.పైగా ఈమధ్య అమ్మాయిలను ఏడిపించే వాళ్లని వ్యాన్‌లో ఎక్కించి..మెడలో బోర్డు తడిలించి అర్ధనగ్నంగా ఊరేగిస్తున్నారు. అలా చేస్తే కాలనీకి ఎంత చెడ్డపేరు చెప్పండి..."

"అయితే... మమ్మల్ని ఏం చేయ మంటారు.."- ఇబ్బంది పడుతూనే అడిగారు వాళ్లు".

ఈవ్‌టీజింగు అరికట్టేందుకు మీరొక సెల్ నిర్వహించాలి. ఉన్నవాళ్లలో మీరే చురుకైన వాళ్లని ఈ బాధ్యత అప్పచెబుతున్నాను"

వాళ్లు మౌనంగా వింటున్నారు.

కాలనీలో ఉన్నకుర్రవాళ్లతో మాట్లాడండి. ఈ విషయం చెప్పండి. ఆడవాళ్ళు ఎవరూ ఇబ్బంది పడకుండా చూడండి. ఇబ్బందులొస్తే పరిష్కరిం చండి"- నా దగ్గర నుంచి వెళ్లేముందు ఇంకోమాట చెప్తాను.

"ఇదంతా ఉత్తినే చేయించటం నాకిష్టంలేదు. ప్రెసిడెంటు గారికి చెప్పి- కార్పస్ ఫండ్‌లో నుంచి పాకెట్‌మనీ కింద ఎంతో కొంత వచ్చే ఏర్పాటు చేస్తాను".

నా మాటలు వాళ్లపై ఎలాంటి ప్రభావం చూపుతాయో...అసలుమార్పు సాధ్యమవుతుందా నేను ఆలోచించలేదు.ఒక ప్రయత్నం చేశాను అంతే...

× × ×

కాలనీ వాసులు మెచ్చుకుంటున్నారు. ప్రసంగాలు కొనసాగుతున్నాయి.నేను ఉక్కిరి బిక్కిరవుతున్నాను

"కిషోర్‌గారు కాలనీలో ఎన్ని సంస్కరణలు తెచ్చారని...!డిగ్రీ చదివిన నిరుద్యోగులచేత ట్యూషన్ సెంటర్ ప్రారంభింపచేశారు.దాదాపు పది పన్నెండు మందికి పాఠాలు చెప్పి వాళ్లు పొట్ట పోసుకుంటున్నారు.

ఒకతను లెండింగ్ లైబ్రరీ నిర్వహిస్తున్నారు. వారపత్రికలు, సినిమా పత్రికలు.... ఇవేకాదు...పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు నిర్వహిస్తున్నారట.

ఇదేమంత పెద్ద విశేషం కాదుగానీ...

అతనే మొన్న బ్యాంకు ప్రొబేసనరీ ఆఫీసర్‌గా ఎంపికయ్యాడు..."

హాలులో ఒక మూలగా నిలబడిన ఆ వ్యక్తి లేచి గౌరవ పూర్వకంగా అందరికీ నమస్కరించారు.

'పిల్లల కల్చరల్ క్లబ్... ఆదివారం పిల్లల్లో మానసిక వికాసానికి దోహదం చేస్తోంది.టీవీల ముందుగంటలకొద్దీ కూలబడే పిల్లలు ఇప్పుడు డ్రాయింగ్,పెయింటింగ్ వంటి వాటితో కాలక్షేపం చేస్తున్నారు."

చప్పట్లు మారు మోగు తున్నాయి. ఒక నిముషం మాట్లాడటం ఆపి మళ్లీ కొనసాగించాడు వక్త. "ఉద్యోగం చేసే ఆడవాళ్లు తమ పిల్లల్ని కాలనీలో ఉన్న క్రెచ్ లోనే ఉంచుతున్నారు. ఇంటి పట్టునే ఉండే వీళ్లకి ఇది మంచి వ్యాపకంగా మారింది. ఆదాయం సమకూరుతోంది.

ఉదయాన్నే యోగా, ధ్యానం.. సాయంత్రం కుట్లు ,అల్లికల శిక్షణ ... వృద్దులు సేదతీరడానికి ప్రత్యేక ఏర్పాట్లు.....

ఇవన్నీ సాధించటం ఒక ఎత్తయితే ఈవ్ టీజింగ్ అదుపు చేయటం మరో ఎత్తు"

నిజమే అనిపించింది నాకు. ఇది సాధారణ విజయం కాదు.



విజయా రెసిడెన్సీ, అనకాపల్లిలో 12-7-2009న జరిగిన ఆంధ్రా పద్య కవితా సదస్సు, విశాఖజిల్లా ప్రచార కార్యదర్శి అబ్దుల్ అజీజ్‌ను తన స్వీయరచన శ్రీమద్రామాయణం' గ్రంథంతో సత్కరిస్తున్న ఆచార్య సార్వభౌమ బ్రహ్మశ్రీ, వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి. చిత్రంలో ప్రముఖ రంగస్థల కళాకారుడు మండా సత్యన్నారాయణ ప్రసాద్

'ఒరే! మీకు అక్కాచెల్లెళ్లు లేరా? మీ అమ్మనో, చెల్లినో ఏడిపిస్తుంటే ఊరుకుంటారా? ఆడవాళ్లను వేధించకండి' లాంటి ఉపన్యాసాలిస్తే వాళ్లు వినరు సరికదా?

నీతులు చెప్పినందుకు దేహశుద్ధి చేస్తారు. అందుకే దొంగకు తాళాలు ఇచ్చినట్లు....

వాళ్లను రెచ్చగొట్టి.. పని అప్పజెప్పి... చివరికి అనుకున్నది సాధించగలిగాను.

ఓ రెండు మూడొందలకు ఆశపడి వాళ్ళు సన్మార్గంలో నడిచారని నేను అనుకోవడంలేదు.

చాలామంది కుర్రాళ్ల మాదిరిగానే వాళ్లలోనూ గుర్తింపు కోసం ఆరాటం.... నలుగురి దృష్టిలో పడాలని మెచ్చుకోళ్లు సొంతం చేసుకోవాలని... దీన్నే ఓ మంచి పని కోసం నేను వినియోగించాను. రోజూ వీధి మలుపులో నిలబడి- వచ్చేపోయే ఆడవాళ్లని కామెంట్ చేసే వాళ్ళకి-

దాన్నుంచి దూరంగా జరగటం, మిగిలిన వాళ్లని అదుపుచేయటం-

అంత తేలికయిన విషయంకాదు. వాళ్లు దాన్ని సాధించారు. చేసి చూపించారు. నలుగురి దృష్టిలో నన్నో హీరోను చేశా... వాళ్ల విజయాన్ని నా ఖాతాలో జమ చేశారు. మనసంతా కృతజ్ఞతతో నిండిపోయింది.

వక్తల ప్రసంగాలు కొనసాగుతున్నాయి.

ప్రశంసలు... చప్పట్లు...

ఇవేమీ నా చెవిన పడటంలేదు.

చుట్టూ ఉన్న గుంపులో ఆ కుర్రాళ్ల కోసం నా కళ్లు ఆశగా వెతికాయి.

# విధ్వంసం చేస్తున్నప్పుడు

## పలమనేరు బాలాజి

మొన్నటి గాయాలే
ఇంకా పచ్చిగా ఉన్నప్పుడు
నిన్నటి గాయాలగురించో
లేదా ఈ రోజుటి గాయాలగురించో
ఊసులెందుకు? చెప్పు!
నిర్మాణంలో వున్న మనిషే
పోరాటాల్ని,గాయాల్ని తట్టుకుంటాడు
విధ్వంసం చేస్తున్నప్పుడే
గాయాలకో , కాలానికో ఎదురు తిరుగుతాడు
గాయాలకు గాయాలే కారణాలైనప్పుడు
గాయాలకు గాయాలే ఉపశమనాలైనప్పుడు
-ఓదార్పులైనప్పుడు
గాయాల్ని ఒదులుకోలేం
వద్దువద్దని అనలేం.
నువ్వెన్నిమార్లు గాయపరుస్తావో చెప్పు!
నువ్వెంత దారుణంగా గాయపరుస్తావో చెప్పు!
రాతి పలకల మధ్య బ్రతికేవాడ్ని
రాబందుల మధ్యబ్రతికేవాడ్ని
దెబ్బదెబ్బకు రాటుదేలిపోవటం
దెబ్బదెబ్బకు పాత గాయాల్ని వదిలించుకోవటం
దెబ్బదెబ్బకుపదునుదేలిపోవటం
తెలిసిన వాడ్ని
మట్టిలోతప్ప ఇంకెక్కడా నడవలేనివాడ్ని
మనిషితో తప్ప మరెవరితోనూ బ్రతకలేని వాడ్ని
ముక్కలయిన ప్రతిసారి- రాయి రూపాంతరంచెంది
పునర్జన్మలు పొందినట్లు- ముక్కలు ముక్కలై
విధ్వంసం అయిన ప్రతిసారి
రాతిముక్కల్లా రూపాంతరంచెందేవాడ్ని
పునర్జన్మలు పొందేవాడ్ని.
నీకు గాయపరచటం తెలిసినట్లు
నీకు విచ్ఛిన్నంచేయటం తెలిసినట్లు
నాకు గాయపడటమూ తెలుసు
గాయాల్నే ఓదార్పుపవనాల్ని
చేసుకోవటమూతెలుసు
విధ్వంసం అవుతున్న ప్రతిసారీ
పునర్జన్మించటమూ తెలుసు.
పునర్నిర్మించబడటమూ తెలుసు.
నీకు భయపడటం,భయపెట్టడం
బాధపడటం,బాధపెట్టడం తెలిసినట్లే
నాకుభయపడక పోవటం,బాధపడకపోవటం తెలుసు
జీవితం,మనిషి ఏకస్వరూపాలని తెలిసిన వాళ్ళకు
ఎందుకుజీవించాలోతెలుసు
ఎందుకు పునర్నిర్మింపబడాలో తెలుసు
గదిచుట్టూనేకాదు
గదిలోపలి గోడలూ తెలిసినవాడ్ని
గదిలోపలి ఒంటరితనమూ తెలిసినవాడ్ని
గదిలేకపోవటమూతెలిసినవాడ్ని
నన్నొక గదిని చేయాలనో
నువ్వొక గదివి కావాలనో అనుకుంటావు
గదిని నిర్మించటంకాదు
నదిని నిర్మించటం ముఖ్యం.
మనుషులు గదులు గదులవటం కాదు
మనుషులు నదులు కావటం ముఖ్యం
పరవళ్ళు కావటం ముఖ్యం
మనసుతో బ్రతకటం తెలిసినవాడికి
నదికావటం తెలిసే వుంటుంది
పరవళ్లు కావటమూ తెలిసే వుంటుంది
వేనవేల ఎడారులమధ్య
నదులూవుంటాయి
నదుల మధ్య ఎడారులూ వుంటాయి
నువ్వు ఎడారివవుతున్న ప్రతిసారీ
నేను నదినవుతుంటాను.
నీ వేళా కోళాలమధ్య,వెక్కిరింతల మధ్య
నీ అయిష్టాలు, అసంతృప్తులు,
అవమానాల కొలుములు, విధ్వంసాలమధ్య
నాదైన పరిమళంతో
పరవళ్ళు తొక్కుతుంటాను.
మిత్ర శత్రుత్వాల మధ్య- శత్రు మిత్రత్వాల మధ్య
పరవళ్ళు తొక్కుతుంటాను.